క్లుప్తంగా

విభిన్న ప్రతిభావంతుల సర్వే

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భవిత సెంటర్ సహిత విద్య ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సర్వేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత సెంటర్ సహిత విద్య ఉపాధ్యాయులు బి.హరికృష్ణ మాట్లాడుతూ.. బడికి వెళ్లని చిన్నారులు, విభిన్న ప్రతిభావంతులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. మహానాడు 8వ లైన్‌లో ఒక పాపను గుర్తించి భవిత సెంటర్‌లో చేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వి.సునీతకుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో ఏసీసీ కార్మికులు 174వ రోజు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు వై.రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కె.ఆంజనేయులు, ఏడుకొండలు, అంకమ్మ, ప్రశాంత్, ఇస్మాయిల్, ఆశీర్వాదం, దుర్గాభవాని, శారద, సారమ్మ, లక్ష్మి, జానీ తదితరులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

మంగళగిరి టౌన్: మనిషి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో సోమవారం ఉచిత యోగ శిక్షణా తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నెల రోజుల ముందు నుంచి యోగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న యోగా తరగతులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరి దివ్యకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాలువల్లో తూడు తొలగించాలని వినతి



దుగ్గిరాల: సీపీఎం పార్టీ మండల నాయకులు సోమవారం తహసీల్దార్ ఐ.సునీతకు పంట కాలువల్లోని తూడు తొలగించాలని వినతి పత్రం అందజేశారు. మండల కార్మిక నాయకులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. బకింగ్‌హోమ్ కెనాల్ నుంచి సాగు నీరు పారే తూములు గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయిందని అన్నారు. పలు చోట్ల కాలువ గండ్లు పడి ఉందని.. వాటికి మరమ్మత్తులు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.అమ్మిరెడ్డి, ఎం.హరీష్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

తాడికొండ: ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని.. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షులు మల్లంపాటి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దిగుబడులు ఉన్నా ధరలు లేక రైతులు సతమతం అవవుతున్నారు. మిర్చి ధరలు మరింత దిగజారి రూ.5 వేల నుంచి రూ.8 వేలు పలుకుతుండటంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. గిట్టుబాటు ధరలు పెంచి ప్రభుత్వం కొనుగులో చేయాలని ఆ ప్రకటనలో ఆయన కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలి

తాడికొండ: బాలలు పాఠ్యాంశాలు నేర్చుకోవడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా రాణించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు పోపూరి వెంకటేశ్వర్లు అన్నారు. తుళ్లూరు ప్రజా సంఘాల కార్యాలయంలో బాలోత్సవం పేరిట సోమవారం ప్రారంభించిన సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. బాలలు చిన్నతనం నుంచే సామాజిక అవగాహన పెంపొందించుకొని పరిస్థితులకు అనుగుణంగా ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ నిర్వాహకులు సునీత, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

మూగబోతున్న చేనేత మగ్గాలు

- చేనేత కార్మికులకు కరువవుతున్న ఆదరణ
- గత ప్రభుత్వంలో ఏటా రూ.24 వేలు ఆర్థిక సహాయం
- కూటమి ప్రభుత్వంలో అందని పరిహారం
- సంక్షేమ పథకాల కోసం నేతన్నల ఎదురుచూపులు



పనులు లేక ఖాళీగా ఉన్న మగ్గాలు

మంగళగిరి టౌన్: నియోజకవర్గ పరిధిలో మంగళగిరి చేనేతకు ప్రసిద్ధి. సుమారు చేనేత వృత్తిపై 1500 కుటుంబాలు పైనే ఆధారపడి ఉన్నాయి. సుమారు 3 వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. చేనేత వృత్తిలో డైయింగ్, పాడుగులు అల్లడం, అచ్చులు వేయడం, మగ్గం నేసేవారు, నూలు ఒడకడం, కండెలు చుట్టడం, తదితర పనులు చేస్తూ సుమారు 10 వేల మంది వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం నేతన్నలు చేనేత పరిశ్రమకు దూరం అవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్నల దయనీయ పరిస్థితిని గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. దీంతో చేనేతకు దూరమైన కార్మికులు తిరిగి పరిశ్రమవైపు మళ్లారు. కూటమి ప్రభుత్వం చేనేతల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇలానే కొనసాగితే చేనేత మగ్గాలు మూగబోనున్నాయని నేతన్నలు వాపోతున్నారు.

వలస పోవడమే మార్గమవ్వనుంది..

చేనేతల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అందించిన వైఎస్సార్ నేతన్న హస్తం పథకం వారి జీవితాలకు కొండంత అండగా ఉండేది. ఒక్కొక్కరికి రూ.24 వేల చొప్పున వారి ఖాతాల్లో ఏటా జమచేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ పథకం ఊసే తేకపోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా సంక్రాంతికి 3 నెలల ముందే మాస్టర్ వీవర్స్ నుంచి అనేక ఆర్డర్లు వచ్చేవి. ఈ ఏడాది ఆ ఆర్డర్లు ఊహించిన స్థాయిలో రాకపోవడంతో పనిలేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వం సహాయం అందించకుంటే వలస పోవడం తప్ప వేరే మార్గం లేదని అంటున్నారు.

నేతన్న నేస్తం అందించాలి..



చేనేత కార్మికులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని అందించి ఆదుకుంది. గతంలో మాదిరిగా ఏడాదికి రూ.24 వేలు నేతన్నలకు ఆర్థిక సహాయంగా అందించాలి. గతంలో నూలుపై సబ్సిడీ, పావలా వడ్డీకే రుణాలు తదితర పథకాలు ఉండేవి. వాటిని రద్దు చేయడంతో చేనేతలకు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. వీటిని పునరుద్ధరించడంతో పాటు చేనేత వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని తొలగిస్తే చేనేతలకు పూర్వ వైభవం వస్తుంది.

ఊట్ల పాలశ్రీను, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు

నేతన్నలను ఆదుకోవాలి..



మంగళగిరి పరిధిలో 22 సొసైటీలు ఉన్నాయి. సుమారు 1500కు పైగా కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చేనేత కార్పొరేషన్‌ను వెంటనే ప్రకటించాలి. ప్రస్తుతం నూలు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు జీఎస్టీ విధించి చేనేతల నడ్డి విరిచింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చేనేత భవన్‌ను ప్రారంభించాలి.

పూజల మనోహర్, మంగళగిరి నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షులు

నిరుపయోగంగా చేనేత భవనం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన చేనేత భవనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేనేత వ్యాపారులకు నగర పరిధిలోని పాత బస్టాండ్ ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ ప్రగడ కోటయ్య చేనేత భవన్‌ను రూ.6 కోట్ల వ్యయంతో దుకాణ సముదాయాన్ని నిర్మించి ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిపివేశారు. చేనేత భవనంలో దుకాణాలు కేటాయించి, తెనాలి రోడ్డు విస్తరణ చేపడతారని భావించిన నేతన్నలు తమ ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత భవనంలోని దుకాణాలను కేటాయించి ప్రారంభించాలని నేతన్నలు కోరుతున్నారు.

ముగిసిన శ్రీ ప్రపత్తి ఆంజనేయుని ఉత్సవాలు



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధి మిద్దె సెంటర్‌లోని శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో 3 రోజులపాటు జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల సందర్భంగా శ్రీ ప్రపత్తి ఆంజనేయస్వామి అన్నసమారాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్‌లు హాజరై మాట్లాడారు. ట్రస్ట్ దాతల సహకారంతో అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కమిటీ మరిన్ని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ పారేపల్లి రామకృష్ణ, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, ట్రస్ట్ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు, ట్రస్ట్ ప్రతినిధులు రాజశేఖర్, రమేష్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర నాయకుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రాష్ట్ర నాయకులు


మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర అధ్యక్షులుగా కుంచాల కృష్ణ కిషోర్ ఎన్నికయ్యారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో సోమవారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా తురకా రామారావు, గౌరవ అధ్యక్షులుగా తురకా లవకుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణకిషోర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది ఉన్న వడ్డెరలను 6 లక్షల మంది మాత్రమే ఉన్నట్లు చూపిస్తున్నారని, దీని వల్ల వడ్డెర జాతి ఎంతో నష్టపోతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లపు శ్రీనివాస్, ఆంజనేయులు, ఉప్పు మహేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు జైలు శిక్ష

కొల్లిపర: ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎస్సై పి కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర మండలం కుంచవరంకు చెందిన వెలివెల కోటేశ్వరావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలబెట్టి ఇంట్లోకి వెళ్లి ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. దీంతో వాహనం చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో కొల్లిపరకు చెందిన కేశన గంగాధర్ రావు తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో అమిరే ఆనంద్ కిషోర్, పిల్లి శ్రీను నిందితులుగా నిర్ధారించి అరెస్ట్ చేసి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కోర్టులు చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో సదరు ఇద్దరు ముద్దాయిలపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ పి.రాజశేఖర్ తీర్పు వెలువరించారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పేదల ఇళ్ల తొలగింపునకు నోటీసుల జారీ అమానుషం

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న బేతపూడి గ్రామస్తులు

రేపల్లె: బేతపూడి గ్రామంలో రహదారి పక్కన సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగిస్తామంటూ అధికారులు పదే పదే నోటీసులు ఇవ్వటం అమానుషమని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. పేదల గృహాలను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బాధితులు, గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశంతో ఎవరికీ అడ్డులేని పేదల గృహాల తొలగింపుకు పూనుకోవటం కుట్రేనన్నారు. కూలీ పనులు చేసుకుని జీవించే నిరుపేదలపై రాజకీయం చూపించటం తగదన్నారు. రహదారి పక్కన ఉన్న ఆ పూరిళ్ల వల్ల ఎవరికీ నష్టం లేదని గ్రామస్తులు చెబుతున్నప్పటికీ గ్రామంలోని మాజీ ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు వేధింపులకు పాల్పడటం బాధాకరమన్నారు. అధికారులు తరచూ నోటీసులు ఇవ్వటంతో తమ పూరిళ్లు ఎక్కడ కూలదోస్తారోనన్న భయంతో ఆ నిరుపేదలు గత పది రోజుల నుంచి పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారన్నారు. అధికారులు రాజకీయాలను పక్కనపెట్టి మానవతా దృక్పథంతో పేదల ఇళ్లను కూలగొట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిస్థితులను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, సీఐ మల్లికార్జునరావులకు వివరించారు. కార్యక్రమంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ, సీపీఎం, జై భీమ్ పార్టీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

ఘనంగా నర్సులకు సత్కారం



దుగ్గిరాల: ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంత్యోత్సవం సందర్భంగా నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాల ప్రదానోత్సవాన్ని దుగ్గిరాల పీహెచ్‌సీలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామస్వామి మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 12న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఏటా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ ఏడాది మన నర్సులు–మన భవిష్యత్తు అనే నినాదంతో వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దుగ్గిరాల, ఈమని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న నర్సులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు, నర్సులు జెట్టి బాలరాజు, షేక్.సుభాని, మిక్కిలినేని గాంధీ, వెనిగెళ్ల కృష్ణ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను పరిశీలించిన సీపీఎం నాయకులు



చినకాకాని (మంగళగిరి): వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవాలనుకోవడం దుర్మార్గమని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగర పరిధిలోని చినకాకానిలో వక్ఫ్ భూములను పలువురు నాయకులు పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ.. వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామన్నారు. భూములను కౌలు చేసుకుంటున్న రైతులకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగాల అజయ్ కుమార్, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావు, రామినేని చంద్రమోహన్, సుంకర సుబ్బారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలన

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: కాల్వల్లో మురుగు పారుదల జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. 19వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఆప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. కమిషనర్ స్వయంగా కాల్వల్లోని వ్యర్థాలను తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కాల్వలను బాగు చేస్తే చాలా వరకు మురుగు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

వ్యర్థాలు లేకుండా చూడాలి

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. చెంచుపేటలో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

రహదారులపై మూగజీవాలు



రోడ్డుపై తిరుగుతున్న గోవులు

ఫిరంగిపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై గోవులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో పాదచారులు, ద్విచక్రవాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూగజీవాల వల్ల కొన్ని సార్లు ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత గోవుల యజమానులు వాటిని ఇలా వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆహారం కోసం రోడ్డుపై తిరుగుతూ కనిపించింది తింటూ అనారోగ్యం బారిన పడుతున్నాయి. వీటి వల్ల రోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో కొందరు వ్యక్తులను గోవులు పొడవడంతో క్షతగాత్రులైన వారూ ఉన్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై సంచరిస్తున్న గోవులకు రక్షణ కల్పించాలని.. అవి రోడ్డుపై తిరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– ఫిరంగిపురం

రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం



నేలవల్లి ముఖేష్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో బీటెక్ సీఎస్ ఐటీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి జర్మనీలో జరిగిన రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి జర్మనీలోని సుహి షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ షూటింగ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షిప్‌లో తమ వర్శిటీకి చెందిన నేలవల్లి ముఖేష్ కాంస్య పతకం సాధించాడని తెలిపారు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో 22 పాయింట్లతో భారత్‌కు చెందిన ముఖేష్ ఈ పతకం సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్‌ను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ఆధార్ సీడీంగ్ (ఎన్‌పీసీఐ మ్యాపింగ్) చేయించుకోండి

తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు



తెనాలిఅర్బన్: సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌ను చేయించుకోవాల్సిన అవసరం అందరికీ ఉందని తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు సోమ వారం తెలిపారు. రాష్ట్రంలో 51 లక్షల మంది ఇంకా బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్ కార్డుకు అనుసంధానం చేయించుకోలేదని తెలిపారు. గతేడాది జీఎస్‌డబ్ల్యూస్, పోస్టల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఆధార్ సీడింగ్ చేయటం జరిగిందని గుర్తు చేశారు. జూన్ 5వ తేదీ నుంచి పోస్టల్ శాఖ, సచివాలయ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో ఆధార్ సీడింగ్‌ను తెనాలి డివిజన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న శ్రీహనుమత్ జయంతి మహోత్సవాలు



ఉత్సవ పూజల్లో భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమత్ జయంతి మహోత్సవాలు, 17వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు, శ్రీమన్యసూక్త హోమాన్ని ఆలయ వంశ పారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస పండితుడు నాగమారుతి బృందం ఆగమోక్తంగా నిర్వహించింది. సాయంత్రం 1108 లడ్డూలతో విశేష పూజాది కార్యక్రమాలు చేశారు. 108 మంది భక్తులు 108 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11 రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు జరుగుతాయని, భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్ కుమార్, సురేష్, వైకుంఠపురం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, ట్రస్టు సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గాజుల రాజేంద్రప్రసాద్, మాజేటి వెంకటేష్, మద్దు హరీష్, బచ్చు లీలాప్రసాద్, వెచ్చ కృష్ణకిషోర్, సోమశేఖర్ పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

కాకుమాను: నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం పార్టీ సీనియర్ నాయకులు జంపని రామారావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ.. మండలంలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి రైతులు నల్లబర్లీ సాగు చేశారని అన్నారు. గత మూడేళ్లుగా అధిక దిగుబడి, మంచి ధర ఉండడంతో ఈ ఏడాది కూడా కౌలు రైతులు అధిక మొత్తంలో నల్లబర్లి సాగు చేశారని అన్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర లేకపోవడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే పొగాకుకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్, ముద్దన వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బారావు, మర్రి లక్ష్మీ, భువనేశ్వరి, నల్లమోతు రాజేంద్ర, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం నానా అవస్థలు

దరఖాస్తు దారులను సర్వర్ పేరుతో తిప్పుకొంటున్న వైనం

ప్రత్తిపాడు: కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారు ఈకేవైసీ కోసం నానా అవస్థలు పడుతున్నారు. సర్వర్ రాకపోవడంతో పాటు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా దరఖాస్తు దారులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సోమవారం ఉదయం కొందరు దరఖాస్తు దారులు ఈకేవైసీ కోసం వెళితే మధ్యాహ్నం రమ్మని.. మధ్యాహ్నం వెళితే సాయంత్రం రమ్మని, సాయంత్రం వెళితే మర్నాడు రమ్మని.. ఇలా సిబ్బంది నానా ఇబ్బందులూ పెడుతున్నారని వాపోయారు. ప్రత్తిపాడుకు చెందిన పి.గురవయ్య 15 రోజుల నుంచి ఈకేవైసీ కోసం తిరుగుతున్నారు. మామిడి సరోజనరావు వేలిముద్ర వేస్తే గానీ కార్డులో యాడ్ అవ్వరని చెప్పడంతో అదే పనిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గుంజా మల్లేశ్వరి సోమవారం రేషన్ కార్డు కోసం అప్లికేషన్ పెట్టుకున్నారు. సర్వర్ రావడం లేదంటూ ఆమెను సాయంత్రం వరకూ ఉంచి సిబ్బంది వెనక్కి పంపించేశారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.